## బీఆర్ఎస్ సభపై ఎమ్మెల్యే నాగరాజు అక్కసు

**రోడ్ల మరమ్మతుపైన అసహనం**

ఎల్కతుర్తి, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ రజతోత్సవ సభపై వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అక్కసు వెళ్లగక్కారు. బీఆర్ఎస్ సభ కోసం వేస్తున్న రోడ్లు, కాలువల పూడ్చివేతను సోమవారం పరిశీలించిన ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. సభ కోసం చేస్తున్న ఏర్పాట్లలో భాగంగా గేట్లను, దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన కాలువలను విచ్చలవిడిగా మట్టి తవ్వకాలతో పూడ్చుకుంటూ వస్తుండడంతో రైతులు భోరుమని విలపిస్తున్నారని తెలిపారు. అన్నసాగర్-ఎల్కతుర్తి మధ్యలో ఉన్న వాగును, హద్దులను చెరిపేసి వాగును పూర్తిగా ధ్వంసం చేశారని, దీనిపై ఇరిగేషన్ శాఖకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. బీఆర్ఎస్ శ్రేణులకు కేవలం రజతోత్సవ సభకు అనుమతులు మాత్రమే ఇచ్చామని, సభకు పొలాలు ఇచ్చిన వారిలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఉన్నారని పేర్కొన్నారు.

# రైతుభరోసా ఆలస్యం.. మన్నించండి

- మార్చి 31లోగా ఇవ్వలేకపోయాం
- మిగిలిన రైతులకు త్వరలోనే జమ చేస్తాం
- నిజామాబాద్ రైతు మహోత్సవం సభలో మంత్రి తుమ్మల క్షమాపణ
- నిజాంసాగర్, ఎస్సారెస్పీ పూడికతీతకు నెలాఖరులోగా టెండర్లు పిలుస్తాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- కాళేశ్వరంపై అక్కసు వెళ్లగక్కుతూనే ప్యాకేజీ పనులు చేస్తామని హామీ



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

నిజామాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతు భరోసా పంపిణీలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్షమాపణ చెప్పారు. 'మమ్మల్ని మీరు (రైతులు) మన్నించాలి. మార్చి 31లోపు రైతుభరోసా వేస్తామని అనుకున్నాం. కానీ, ఆలస్యం అయ్యింది. తప్పకుండా అతి త్వరలోనే మిగిలినవారికి రైతుభరోసా జమ చేస్తాం' అని వెల్లడించారు. సోమవారం ఆయన నిజామాబాద్‌లో నిర్వహించిన రైతు మహోత్సవం ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతూ.. 'కుటుంబం అన్నాక కష్టాలు ఉంటాయి. కష్టకాలంలో, కరువు కాలంలో ఇంట్లో పెండ్లి చేస్తే, ఎంత బాధ ఉంటుందో అలాంటిదే రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నది. అయినా సరే రూ.33 వేల కోట్లను ఒకే సంవత్సరం రైతుల జేబుల్లోకి పంపించాం' అని పేర్కొన్నారు. పంటనష్ట పరిహారం కూడా త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. తక్కువ నీళ్లు పెడితే ఎక్కువ దిగుబడి వస్తుందని, ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిలో నిజాంసాగర్ ఆయకట్టు రైతులు భారీగా దిగుబడి సాధించారని వివరించారు. మూడు, నాలుగు ఏండ్లలో ఆయిల్‌పాం కంపెనీలు వస్తాయని, నీళ్లున్నాయని వరి పంట సాగు కాకుండా, ఆయిల్‌పాం వైపు రైతులు దృష్టి కేంద్రీకరించాలని కోరారు. పసుపు బోర్డుతో రైతులకు లాభం జరిగేవిధంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో అనుబంధ రంగాలను ప్రోత్సహిస్తామని వెల్లడించారు. పసుపు బోర్డును పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రధాని, కేంద్ర ప్రభుత్వంపై ఉన్నదని పేర్కొన్నారు.

**త్వరలోనే పూడికతీత: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

నిజాంసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయిలో పూడికను తొలగిస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ నెలాఖరులోపు టెండర్ పిలుస్తామని, లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరు పారే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీ-20,21,22 పనులతోపాటు గుత్ప లిఫ్ట్ ఇరిగేషన్ పెండింగ్ పనులను కూడా పూర్తి చేస్తామని వెల్లడించారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారని విమర్శించారు. మేడిగడ్డ కూలిన తర్వాత అన్నారం, సుందిళ్ల నిరుపయోగమైనా, రాష్ట్రంలో గత వానకాలం సీజన్‌లో 66.7 లక్షల ఎకరాల్లో రికార్డు స్థాయిలో 153.5 లక్షల టన్నుల వరి ధాన్యం పండించిన ఘనత రైతులకే దక్కిందని పేర్కొన్నారు. ఇదంతా కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిన తర్వాత అంటూ మంత్రి ఉత్తమ్ పదే పదే అక్కసు వెళ్లగక్కారు. యాసంగిలో 57 లక్షల ఎకరాల్లో 127.5 లక్షల టన్నుల వరి ధాన్యం పండిందని చెప్పారు. తెలంగాణలో వానకాలం, యాసంగి పంటలు కలిపి 281 లక్షల టన్నుల వరి ధాన్యం పండించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నవిధంగా ధాన్యం కొనుగోళ్లు గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో లోపాలుంటే నేరుగా తనకు చెప్పాలని, చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీబ్యాగ్ కొరత ఉండటానికి వీల్లేదని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. గన్నీ సంచుల కొరత ఉంటే 24 గంటల్లో చర్యలు చేపడతామని పేర్కొన్నారు.



హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా చెలరేగిన దుమ్ముకు పడిపోతున్న స్వాగత తోరణం

## హెలికాప్టర్ ల్యాండింగ్‌లో గందరగోళం

- రైతు మహోత్సవం ప్రారంభోత్సవంలో తప్పిన ప్రమాదం
- ప్రాణభయంతో పరుగులు తీసిన రైతులు.. పలువురికి గాయాలు

కంఠేశ్వర్, ఏప్రిల్ 21: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వం సోమవారం నిర్వహించిన రైతు మహోత్సవం ప్రారంభ వేడుకల్లో గందరగోళం చోటు చేసుకున్నది. మంత్రులు ప్రయాణించిన హెలికాప్టర్ ల్యాండింగ్ సమయంలో పెనుప్రమాదం తప్పింది. కార్యక్రమ ఏర్పాట్లలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. వేడుకల ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నిజామాబాద్‌కు వచ్చారు. స్థానిక గిరిరాజ్ కేంద్రంలో హెలికాప్టర్ కిందకు దిగుతున్న సమయంలో కళాశాల మైదానంలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున దుమ్ము లేచింది. దీంతో రైతు మహాసభ వేడుకల కోసం ఏర్పాటు చేసిన స్వాగత తోరణం కూలిపోయింది. మహోత్సవ వేడుకల్లో ఏర్పాటు చేసిన కొన్ని స్టాళ్లు సైతం ధ్వంసమయ్యాయి. అక్కడ ఏం జరుగుతున్నదో అర్థంకాక ప్రజలు, రైతులు పరుగులు తీశారు. ఈ క్రమంలో పలువురికి గాయాలైనట్టు సమాచారం. ముగ్గురు మంత్రులు వస్తున్నా, ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారని, ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని అక్కడకు వచ్చిన పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు.

# తెలంగాణ రైతులకు ఎవుసం నేర్పింది ఆంధ్రోళ్లే!

మొదటిపేజీ తరువాయి...

నిజాం తీసుకువచ్చాడంటూ (పక్క నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందించడంతో) పీసీసీ చీఫ్ చెప్పారు. రైతులు ఓటేశారు కాబట్టే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు విదేశాలకు వెళ్లడం కాదని, ఎంపికచేసిన రైతులను విదేశాలకు తీసుకెళ్లి ట్రైనింగ్ ఇప్పించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మహేశ్‌కుమార్‌గౌడ్ కోరారు.

**కాళేశ్వరంపై అదే అక్కసు**

పనికిరాని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి రూ.లక్షా 25 వేల కోట్లు గోదావరి నదిలో పోసిన పాపం కేసీఆర్‌ది అంటూ మహేశ్‌కుమార్‌గౌడ్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు. పదిసార్లు ఎత్తి పోస్తే కానీ మల్లన్నసాగర్‌కు నీళ్లు రావని వ్యాఖ్యానించారు. ఒక ఎకరానికి నీళ్లు రావాలంటే రూ.60 వేల కరెంటు బిల్లు వస్తుందని పేర్కొన్నారు. ఒకవైపు, కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేస్తూనే మరోవైపు అదే ప్రాజెక్టులో భాగమైన ప్యాకేజీ-20, 21, 22 పనులను పూర్తిచేయడానికి రూ.600 కోట్ల నిధులు ఇవ్వాలని ఇరిగేషన్ శాఖ మంత్రిని కోరడం గమనార్హం.

**ఆంధ్రా పాలకుల మెప్పు కోసమే తప్పుడు మాటలు: నిరంజన్‌రెడ్డి**



హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): ఆంధ్రా నుంచి వలస వచ్చిన వారు తెలంగాణ రైతులకు వ్యవసాయం నేర్పించారంటూ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడటం తీవ్ర అభ్యంతరకరమని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. మహేశ్‌కుమార్‌గౌడ్ అపరిపక్వత, అజ్ఞానంతో మాట్లాడిన మాటలు తెలంగాణకు తీవ్ర అవమానకరమని పేర్కొన్నారు. ఆంధ్రా పాలకుల మెప్పుకోసమే ఆయన దిగజారుడు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామరక్ష అని కేసీఆర్ పదే పదే చెప్పిన విషయం పీసీసీ చీఫ్ మాటలతో తేటతెల్లమైందని స్పష్టం చేశారు. వెయ్యేండ్ల క్రితమే మన ప్రాంతంలో వరి పండించిన ఆనవాళ్లు ఉన్నాయని చరిత్రకారులు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రపంచానికి వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్‌ను నేర్పిన, అతిపెద్ద భారీ నీటిపారుదల ప్రాజెక్టు కట్టిన ఘనత తెలంగాణ సొంతమని చెప్పారు. కానీ, పెద్దస్థాయిలో ఉన్న వ్యక్తి ఇవేమీ తెలియకుండా ఇష్టమొచ్చినట్టు మాట్లాడటం అభ్యంతరకరమని పేర్కొన్నారు.

**క్షమాపణలు చెప్పాలి: వేముల ప్రశాంత్‌రెడ్డి**



ఆంధ్రా ప్రాంతం వారు తెలంగాణ రైతులకు వ్యవసాయం నేర్పించారంటూ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తప్పుబట్టారు. మహేశ్‌కుమార్ వైఖరి యావత్ తెలంగాణ సమాజాన్ని అవమానించినట్టు ఉన్నదని మండిపడ్డారు. భావదారిద్ర్యంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్టు మాట్లాడటం దురదృష్టకరమని పేర్కొన్నారు. నాడు తెలంగాణ ఏర్పాటుకు అడ్డుపడ్డ సమైక్య పాలకుల అడుగులకు మడుగులొత్తిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు తెలంగాణలో ఉన్నామనే సోయి మరిచి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. మన వ్యవసాయ చరిత్ర తెలియని వ్యక్తులు పాలకులు కావడం దురదృష్టకరమని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ నేతలకు సోయి లేదు: జీవన్‌రెడ్డి**



ఖలీల్‌వాడి/మోర్తాడ్, ఏప్రిల్ 21: రాష్ట్ర కాంగ్రెస్ నేతలవి బానిస బతుకులని, వారికి బొత్తిగా తెలంగాణ సోయి లేదని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి విమర్శించారు. ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చిన రైతులు వ్యవసాయం చేయడం నేర్పారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నిస్సిగ్గుగా వ్యాఖ్యానించడం ద్వారా తెలంగాణ రైతులను ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. వేల ఏండ్లుగా వ్యవసాయం చేస్తున్న తెలంగాణ రైతులు దేశానికే రోల్ మాడల్ అని అభివర్ణించారు. సాగు పాఠాలు నేర్పడం తప్ప, నేర్చుకునే స్థితిలో తెలంగాణ రైతులు లేరని పేర్కొన్నారు. తెలంగాణలో సాగు వనరులు చూసి ఎక్కడెక్కడి నుంచో ఎందరో బతకడానికి వచ్చారని గుర్తుచేశారు. కానీ, వలస రైతులు మనకు వ్యవసాయం చేయడం నేర్పారని పీసీసీ అధ్యక్షుడు పేర్కొనడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్‌కుమార్‌గౌడ్ రాజకీయ అపరిపక్వతకు ఈ వ్యాఖ్యలే నిదర్శనమని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలోనే తెలంగాణ రైతులు ఆగమయ్యారని, వ్యవసాయ రంగం చితికిపోయిందని స్పష్టంచేశారు. ఈ నిజం మరిచి ఎవరి మెప్పుకోసమో, ఏ రోటి కాడ ఆ పాట పాడే మహేశ్‌కుమార్‌గౌడ్ అవకాశవాద రాజకీయాలను తెలంగాణ ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. పీసీసీ చీఫ్ తెలంగాణ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆయనను జిల్లాలో అడుగు పెట్టనివ్వబోమని హెచ్చరించారు. మంత్రులు తుమ్మల, ఉత్తమ్ నోట అదే అరిగిపోయిన రికార్డు మార్మోగిందని ఎద్దేవా చేశారు.

## పైలట్‌కు డీజీసీఏ నోటీసులు

**నిజామాబాద్ ఘటనపై విచారణకు ఉన్నతాధికారుల ఆదేశం**

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): నిజామాబాద్ జిల్లా కేంద్రంలో హెలికాప్టర్ ల్యాండింగ్ ఘటనపై పైలట్‌కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కార్యాలయం నోటీసు జారీచేసింది. హెలికాప్టర్‌ను నిర్దిష్ట ప్రాంతంలో కాకుండా మరో చోట పైలట్ ల్యాండ్ చేసినట్టు డీజీసీఏ అభిప్రాయపడింది. నిజామాబాద్‌లో సోమవారం జరిగిన రైతు మహోత్సవ సభకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ వచ్చారు. ఈ హెలికాప్టర్ హెలిప్యాడ్ ఏర్పాటు చేసిన ప్రదేశంలో కాకుండా సభా ప్రాంగణం పక్కనే ల్యాండ్ అయ్యింది. దీంతో ఒక్కసారిగా హెలికాప్టర్ రెక్కల నుంచి వచ్చిన గాలితో టెంట్లు, స్వాగత తోరణం కూలిపోయాయి. దీంతో సభా ప్రాంగణం నుంచి రైతులు పరుగులు పెట్టారు. ఫలితంగా స్వల్ప తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనపై సీరియస్ అయిన డీజీసీఏ పైలట్‌కు నోటీసులు జారీచేసింది. రాష్ట్ర ఉన్నతాధికారులు ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని స్థానిక జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్లను ఆదేశించింది.

## ఎస్సీల వర్గీకరణపై వివరణ ఇవ్వండి

**రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు**

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): ఎస్సీల వర్గీకరణ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యంపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆ చట్టంపై 6 వారాల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఎస్సీల వర్గీకరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుక ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు లాయర్ ఆకాశ్ బాగ్లేకర్ వాదిస్తూ.. దేవేందర్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్‌ను వర్తింపజేయాల్సి ఉన్నదని తెలిపారు. కానీ, దాన్ని అమలు చేయకపోవడం వల్ల ఇప్పటికే రిజర్వేషన్ల వల్ల ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారులు, వారి కుటుంబసభ్యులే తిరిగి రిజర్వేషన్ల ఫలాలు పొందుతారని, దీంతో రిజర్వేషన్ల లక్ష్యం నీరుగారుతుందని వివరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎస్సీల వర్గీకరణ చట్టాన్ని కొట్టేయాలని కోరారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. విచారణను 2 నెలలకు వాయిదా వేసింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేశాక 2 వారాల్లోగా రిప్లయ్ కౌంటర్‌ను దాఖలు చేయాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది.

## 25 లక్షలు చెల్లించిన చెన్నమనేని

- హైకోర్టు ద్వారా డీడీ అందజేత

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): పౌరసత్వ వివాద కేసులో మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ సోమవారం హైకోర్టు ద్వారా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు రూ.25 లక్షల డిమాండ్ డ్రాఫ్ట్‌ను, రూ.5 లక్షలను రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థకు అందజేశారు. ఈ కేసులో కేంద్ర ఉత్తర్వులను సవాలు చేస్తూ రమేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.

## సచివాలయంలో మరో 30 కెమెరాలు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సెక్రటేరియట్‌లో తరుచుగా నకిలీ ఉద్యోగులు హల్‌చల్ చేయడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నది. సచివాలయంలో ఉన్న భద్రత, నిఘా ఏర్పాట్లపై, సీఎం రేవంత్ ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంపై సోమవారం జీఏడీ ఆరా తీసింది. సెక్రటేరియేట్‌లో 246 సీసీ కెమెరాలు ఉన్నాయని, అదనంగా మరో 30 కెమెరాలను అమర్చే యోచనలో ఉన్నామని నిఘా వర్గాలు తెలిపాయి.

# కేటీఆర్‌పై కేసులు కొట్టివేసిన హైకోర్టు

మొదటిపేజీ తరువాయి...

ఉట్నూరులో వేర్వేరు ఆరోపణలతో కేటీఆర్‌పై రెండు కేసులు నమోదయ్యాయి. గత నెల 18న ఇరుపక్షాల వాదనలు పూర్తికావడంతో తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరును తప్పుబట్టారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, సరైన విచారణ కూడా జరుపకుండా కేసు నమోదు చేసిన తీరును ఆక్షేపించారు.



**డ్రోన్ కేసు కొట్టివేత..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో కేటీఆర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్‌పై కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ నాయకులు గత ఏడాది జూలై 26న మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించారు. ఎటువంటి సమాచారం లేకుండా తమ అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరించారని మేడిగడ్డలోని నీటిపారుదలశాఖ సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వలీషేక్ చేసిన ఫిర్యాదు మేరకు మహదేవ్‌పూర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో న్యాయమూర్తి తీర్పును వెలువరిస్తూ.. 'మహదేవ్‌పూర్ పోలీసులు నమోదు చేసిన కేసు చెల్లదు. దర్యాప్తు అధికారి కేసును నిబంధనల ప్రకారం నమోదు చేయలేదు. అదనపు ఆరోపణ చేస్తూ మెమోను దాఖలు చేయడం కూడా చెల్లదు. సాక్షులందరూ ఒకే రకమైన వాంగ్మూలం ఇచ్చారు. ఈ వాంగ్మూలం ఆధారంగా అధికారిక రహస్యాల చట్టం కింద కేసు నమోదు చేయడం చెల్లదు. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్ కింద మేడిగడ్డను నిషేధిత ప్రాంతంగా ప్రకటించే అధికారం రాష్ట్రానికి లేదు. రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత ప్రాంతంగా చేయాలని కేంద్రాన్ని కోరితే సరిపోదు. కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయాలి. కానీ కేంద్రం నోటిఫికేషన్‌ను వెలువరించలేదు. ఎయిర్‌క్రాఫ్ట్ చట్టంలోని సెక్షన్ 10ఏ ఉల్లంఘనకు సంబంధించి జరిమానా విధించాలి. ఆ పరిధి కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది. కేటీఆర్, ఇతరులు గత ఏడాది జూలై 26న మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శిస్తే మూడున్నర రోజుల తర్వాత వచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మూడు రోజులు ఎందుకు జాప్యం జరిగిందో వివరణ కూడా లేదు. ఎలక్ట్రానిక్ మీడియాలో వార్తలు చూసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం వల్ల ఫిర్యాదు చేయడం ఆలస్యమైందనే కారణం ఎంతమాత్రం సంతృప్తికంగా, ఆమోదయోగ్యంగా లేదు. కేసు నమోదు చేయడంలో దర్యాప్తు అధికారి చట్ట నిబంధనలను అనుసరించలేదు. సుప్రీంకోర్టు వెలువరించిన పలు తీర్పుల ప్రకారం మహదేవ్‌పూర్ పోలీసుస్టేషన్‌లో పిటిషనర్లపై నమోదైన కేసు కొనసాగింపు జరిగితే అది న్యాయప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుంది. అందుకే పిటిషనర్లపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తున్నాం' అని పేర్కొన్నారు.

**సీఎం రేవంత్‌పై ఆరోపణల కేసు కొట్టివేత**

సీఎం ఏ రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్)పై ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు పోలీసులు నమోదు చేసిన కేసును కూడా హైకోర్టు కొట్టివేసింది. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం తీర్పు వెలువరించారు. మూసీ ప్రాజెక్టు పేరుతో రూ.25 వేల కోట్ల నిధులను కాంగ్రెస్‌పార్టీ తరలించిందని కేటీఆర్ చేసిన ఆరోపణల వల్ల కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం జరిగిందంటూ ఆత్రం సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉట్నూరు పోలీసుస్టేషన్‌లో గత ఏడాది సెప్టెంబరు 30న కేసు నమోదైంది. ఈ కేసును కొట్టేయాలన్న కేటీఆర్ పిటిషన్‌ను న్యాయమూర్తి అనుమతించారు. ఆత్రం సుగుణ ఇచ్చిన ఫిర్యాదులోని ఆరోపణలకు సంబంధించి సరైన ఆధారాలు లేవని తెలిపారు. ఈ పరిస్థితుల్లో పిటిషనర్‌పై ఎఫ్ఐఆర్‌ను కొనసాగించడం సరికాదని అన్నారు. కేసును కొట్టివేస్తున్నట్టు ప్రకటించారు. కేటీఆర్ ఎవరిపైనా వ్యక్తిగత ఉద్దేశాలతో విమర్శలు చేయలేదని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. ఫిర్యాదుల్లో నేరం ఏమిటో పేర్కొనలేదని ఆక్షేపించారు. రాజకీయ కక్షసాధింపుతో నమోదైన కేసులను కొట్టివేయాలన్న వాదనను న్యాయమూర్తి అంగీకరించారు.

**తప్పు చేయలేదు**

పిటిషనర్ ఎలాంటి తప్పు చేయకున్నా తప్పుడు కేసు నమోదు చేశారని, విచారణ సహా తదుపరి చర్యలు నిలిపివేయడంతో పాటు ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని కేటీఆర్ తరఫున న్యాయవాది టీవీ రమణారావు చేసిన వాదనలను న్యాయమూర్తి ఆమోదించారు. డ్రోన్ ఎగురవేయడం వల్ల మేడిగడ్డ రిజర్వాయర్‌కు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చేసిన వాదనను తోసిపుచ్చారు. డ్రోన్ ఎగురవేతకు వీల్లేదని, మేడిగడ్డను నిషేధిత ప్రాంతంలో చేర్చారన్న వాదనను కొట్టివేశారు. ప్రజాసమస్యను పరిష్కరించాలనే సంకల్పంతో కేటీఆర్ ఇతర పిటిషనర్లు మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శిస్తే, ఎలాంటి విచారణ చేయకుండానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని చెప్పారు.

## వైద్యవిద్యలో నాణ్యత పాటించకపోతే చర్యలు

**ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): వైద్యవిద్యలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఘోస్ట్ ఫ్యాకల్టీని పెట్టి నడిపిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని, ఇది మంచిది కాదని హెచ్చరించారు.విద్య ప్రమాణాలు దిగజారుతాయన్నారు.


## 'సెర్ప్'లో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మంత్రి సీతక్క ఆదేశాలతో 3974 మందికి స్థానచలనం కలగనున్నది. సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాలనలో పారదర్శకత, ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు 100% ట్రాన్స్‌ఫర్లకు అనుమతులిచ్చామని సీతక్క వెల్లడించారు. సాధ్యమైనంత తొందరలో పూర్తి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

# నష్టనివారణకు 'రోహిత్ చట్టం'!

- హెచ్‌సీయూ భూముల వేలంతో కాంగ్రెస్ సర్కారు అభాసుపాలు
- డ్యామేజీ కంట్రోల్ కోసం రోహిత్ వేముల చట్టం అమలు చేయాలని రాహుల్ లేఖ
- విదేశీ పర్యటన నుంచి సీఎం రాగానే నిర్ణయం
- ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని కంచ గచ్చిబౌలిలో ప్రకృతి హననం కారణంగా జరిగిన డ్యామేజీని పూడ్చుకునేందుకు కాంగ్రెస్ కొత్త డ్రామాలకు తెరలేపింది. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భారీగా చెట్లను కొట్టివేయడంపై, వన్యప్రాణులకు ఆవాసం లేకుండా చేయడంపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తిన విషయం విదితమే. ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ దీనిపై స్పందించాలని పలువురు సెలబ్రిటీలు సహా సామాన్యులు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేశారు. ముంబై మెట్రో రైల్ విస్తరణ, ఛత్తీస్‌గఢ్, గుజరాత్ తదితర కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఉన్నచోట పర్యావరణ విధ్వంసంపై వెంటనే స్పందించే రాహుల్‌గాంధీ.. సొంత పార్టీ సర్కారు చేస్తున్న ప్రకృతి హననంపై ఎందుకు స్పందించరని కొద్దిరోజులుగా విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ తనదైన శైలిలో డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారు. హెచ్‌సీయూలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జరిపిన విధ్వంసం, బుల్డోజర్ రాజ్‌పై స్పందించకుండానే.. హెచ్‌సీయూ ప్రస్తావన తీసుకొచ్చారు. తద్వారా కంచ గచ్చిబౌలి అంశాన్ని పక్కదారి పట్టించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డికి రాహుల్‌గాంధీ ఓ లేఖ రాశారు. తెలంగాణలో 'రోహిత్ వేముల చట్టం' తీసుకురావాలని రాహుల్‌గాంధీ ఆ లేఖలో కోరారు. హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్ వేముల, పాయల్ తాడ్వీ, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న యువకులు అర్ధాంతరంగా తమ జీవితాలను ముగించారని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాంటి ఆత్మహత్యలను నివారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణలో యువత బలవన్మరణాలను ఆపేందుకు కొత్త చట్టం తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. అంబేద్కర్, రోహిత్ వేములతోపాటు లక్షలాది మంది ఎదుర్కొన్న వివక్షను ఇతరులు ఎదుర్కొకుండా ఉండేందుకు ఈ చట్టాన్ని రూపొందించాలని సూచించారు. ఈ మేరకు సోమవారం 'ఎక్స్' వేదికగా రాహుల్‌గాంధీ లేఖను విడుదల చేశారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకి లేఖ రాసిన తర్వాత, హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి 'రోహిత్ వేముల చట్టం' తీసుకురావాలని కోరుతూ లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్టు పేర్కొన్నారు. ఈ లేఖ నేపథ్యంలో రాహుల్‌గాంధీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దశాబ్దం క్రితం జరిగిన అంశంపై మళ్లీ స్పందించే రాహుల్‌గాంధీ.. తాజాగా రేవంత్‌రెడ్డి సర్కారు చేసిన పర్యావరణ విధ్వంసంపై ఎందుకు స్పందించడం లేదని విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు. కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో ఒకలా, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న రాష్ట్రాల్లో మరోలా స్పందించడం ఏమిటని నిలదీస్తున్నారు.



**సీఎం తిరిగొచ్చాక నిర్ణయం: చామల**

రాహుల్‌గాంధీ రాసిన లేఖపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి స్పందించారు. విదేశీ పర్యటన నుంచి సీఎం తిరిగొచ్చాక రోహిత్ చట్టంపై సీఎం నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కాగా, 2016లో హెచ్‌సీయూలో చదువుతున్న రోహిత్ వేముల కుల వివక్ష కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిన విషయం తెలిసిందే.

# ఏసీబీ వలలో ఏడుగురు

- మణుగూరులో సీఐ, రిపోర్టర్
- మ్యుటేషన్ పేరిట దొరికిన చిల్పూరు ఆర్ఐ
- ఆర్మూర్ టౌన్‌లో పీఆర్ ఉద్యోగి
- మేడ్చల్ జిల్లాలో డీఈఈ, మరో ఇద్దరు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు

నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 21: రాష్ట్రంలో సోమవారం ఒక్కరోజే వేర్వేరుచోట్ల ఏడుగురు లంచాలు తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కారు. వారిలో ఆరుగురు ప్రభుత్వ ఉద్యోగులు, ఒకరు టీవీ రిపోర్టర్. భూ వ్యవహారం కేసులో బాధితుల పేర్లు చేర్చకుండా ఉండేందుకు రూ.లక్ష లంచం తీసుకుంటుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు సీఐ, టీవీ రిపోర్టర్‌ను వలపన్ని పట్టుకున్నారు. సీఐ సతీశ్‌కుమార్‌కు, బాధితుడికి బిగ్‌టీవీ రిపోర్టర్ మిట్టపల్లి గోపి మధ్యవర్తిగా వ్యవహరించారు. సీఐని, రిపోర్టర్ గోపిని పోలీస్‌స్టేషన్‌కు రప్పించి పూర్తి ఆధారాలతో వారిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జనగామ జిల్లా చిల్పూరులో వారసత్వ భూమిని సర్వేచేసి మ్యుటేషన్ చేసేందుకు రూ.26 వేలు లంచం తీసుకుంటూ ఆర్ఐ వినీత్‌కుమార్ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. చిల్పూరుకు చెందిన ఆవుల లింగయ్యను లంచం డిమాండ్ చేయగా, రూ.26 వేలు ఇస్తుండగా, పట్టుకున్నట్టు వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూరులోని ఎంపీడీవో ఆఫీస్‌లో పంచాయతీరాజ్ శాఖ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌శర్మ రూ.7,500 లంచం తీసుకుంటూ పట్టుబడ్డా డు. నందిపేట మండలం డొంకేశ్వర్‌లో సీసీ రోడ్డు పనుల బిల్లుల మంజూరుకు శ్రీనివాస్ శర్మ లంచం సొమ్ము తీసుకుంటుండగా పట్టుకున్నామని ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపల్ డీఈఈ రఘు రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. రాంపల్లిలోని ఆర్‌ఎల్ నగర్ కాలనీ లో కాంట్రాక్టర్ రమేశ్ రోడ్డు పనులు చేయగా, బిల్లుల మంజూరుకు డీఈఈ, సిబ్బంది రాకేశ్, సురేశ్ లంచం డిమాండ్ చేశారు. రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ పట్టుకున్నారు.



ఏసీబీకి చిక్కిన మణుగూరు సీఐ సతీశ్‌కుమార్, రిపోర్టర్ గోపి



నాగారం డీఈఈ రఘు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రాకేశ్, సురేశ్



చిల్పూర్ ఆర్ఐ వినీత్‌కుమార్



పీఆర్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్